# పూల మనసు

దిగులుతో మబ్బులు కమ్మిన ఆకాశమే అయింది లక్ష్మీదేవమ్మ ముఖం. తులసికోట పక్కన అడుగెత్తునున్న నులక మంచం మీద ఆమె తల కింద చెయ్యి పెట్టుకుని మౌనంగా పడుకున్నది.

సూర్యుడు పడమటి దిక్కుకు వాలేడు. రోజూ ఆ సమయంలో చేసే పనులు - వత్తులు చెయ్యడం, పూలు కోసుకొచ్చి దేవుడికి మాల కట్టడం లాంటివి - చెయ్యలేదామె. కోడలు కంచు గ్లాసుతో కాఫీ తెచ్చిస్తే వద్దని చేత్తోనే సంజ్ఞ చేసిందిగాని పెదవి విప్పి మాట్లాడలేదు.

గుళ్ళోకి వెళ్లే ప్రయత్నం కూడా లేనట్టే వుంది. ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. 'ఎలా జరిగిందో అర్థం కాకుండా వుంది' అనుకుంది భ్రమరాంబ.

అయిదున్నర గంటలైంది. స్కూటర్ స్టాండు వేసి లోపలికి వస్తూనే భార్యని అడిగేడు మధుసూధనం.

"అమ్మ ఇంకా పడుకుని వుందేం భ్రమరా"

వీధి గుమ్మంలోంచి కొంత పెరడూ; పెరటిలోని తులసికోటా కనిపిస్తూనే వుంటాయి.

"చెబుతా. ముందు మీరు ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కుని రండి" అంది భ్రమరాంబ కాఫీ ఇచ్చే ప్రయత్నంలో.

"ఏమ్మా. పడుకున్నావేం. ఏమైందీ?" అడిగేడు మధుసూదనం పెరట్లోకి వెళ్తూనే.

ఆవిడ నోరు విప్పలేదుగానీ చేత్తో ఏదో సంజ్ఞ చేసి వూరుకుంది.

'ఇంట్లో అత్తాకోడళ్ళు దెబ్బలాటలు లేవు. అలకపాన్పుల అలవాట్లూ లేవు. ఒంట్లోనే ఏదో నలతగా వుండి వుంటుంది' అనుకున్నాడు.

కాఫీ తాగుతూంటే భ్రమరాంబ అసలు విషయం చెప్పింది.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయేడు మధుసూధనం. ఆ ముక్కే బయటికి అన్నాడు.

"ఆశ్చర్యంగా వుందే - మనింట్లో ఎప్పుడూ ఇలా జరగలేదు."

"అవును. నాకూ అర్థం కావడం లేదు. ఆమెను చూడండి. ఈ చిన్న విషయానికే దిగులుతో ఎలా మంచం పట్టేశారో" అంది చిన్నగా నవ్వుతూ.

"వేళాకోళం వద్దు భ్రమరా. నీకు తెలీందే ముందీ- మా అమ్మ మనసు. అంత సున్నితం"

"అవున్లెండి" అంది పొరపాటును సరిదిద్దుకుంటూ.

"ఇంతకీ అది ఎలా జరిగిందంటావ్. ఇన్నేళ్ళయి వుంటున్నాం. ఇలా జరగడం ఇదే ప్రథమం"

"నాకూ అదే అర్థం కాకుండా వుందండీ"

"ఇవాళ పొద్దున్న అయిదున్నరకే లేచేను. గేటుకి వేసిన తాళం తీయకుండానే పాల పొట్లాం, పేపరూ గేటు మీంచే అందుకున్నాను"

"అంత చీకట్నే ఎవరొస్తారుగానీ మీరు కంపెనీకి వెళ్లేటప్పుడు కూడ నేను చూసినట్టే గుర్తు"

"అయితే ఆ తర్వాత మన కాంపౌండ్‌లోకి ఎవరొచ్చారంటావ్"

"పదిన్నర టైంలో అనుకుంటా 'నేలతల్లి' పేపరు తాలూకు కుర్రాడొకడొచ్చి అడ్డమైన ప్రశ్నలూ వేసి మనం కొంటున్నది 'తెలుగు దీపం' అని తెలుసుకొని దాన్ని మానేసి వాళ్ళ పేపర్నే కొనమనీ, చందా కట్టమనీ ప్రాణం తీశాడు. అది కుదిరేపని కాదనీ, మాకు నచ్చే పేపరు మేం తెప్పించుకునే స్వేచ్ఛ మాకుందనీ చెప్పి పంపించేశాను. అతగాడు గేటుదాటేవరకూ చూశానులెండి. అతను కాడు"

"మరి తర్వాతెవరొచ్చారూ"

"పన్నెండున్నర ప్రాంతంలో... అప్పటికి మన కొళాయివాడు నీళ్ళింకా వదల లేదులెండి- అప్పుడొచ్చారో ఇద్దరమ్మాయిలు సబ్బులూ, టూత్‌పేస్టులూ, షాంపులూ పట్టుకొని"

"వీళ్ళొకళ్ళూ మనకి - మాకు ఆఫీసుల్లోనూ తప్పటం లేదు"

"ఏం చేస్తారు పాపం! రోజు గడవక ఆడపిల్లలలా వీధినపడి అమ్ముకుంటున్నారు. ఎండనక, వాననక తిరుగుతారు కదా అని వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి కొంటాను జాలిపడి – ఎక్కడన్నా మనం కొనేవేగా అని"

"నువ్వు కొంటున్నావని వాళ్ళూ వస్తుంటారు. అవునా"

"అలాగే అనుకోండి. బట్టలకు పెట్టే నీలిమందు అయిపోయింది కదా! అది కొన్నానివాళ. మంచినీళ్ళడిగి, నీడన కూర్చుని టిఫిన్ బాక్సులు విప్పుకుని తిని వెళ్ళేరు. ఇరవైలోపే వుంటుంది వయసు ఇద్దరికీ. కష్టపడి సంపాదించే వాళ్ళు ఇలాంటి పని చేయరు కదా"

"తర్వాతెవరొచ్చారు?"

"రెండున్నరకి పోస్టుమేనూ, మూడు గంటలకి పని మనిషి వచ్చారు – మన పని మనిషి అటువంటిది కాదు. దానిమ్మ కాయలూ జామకాయలూ కిందికి అందే రోజుల్లో కూడా ముట్టుకునేది కాదు. ఇన్ని పువ్వులున్నా ఒక్క పువ్వన్నా తెంపదు. అది పనిచేసుకు వెళ్లేకనే అత్తయ్యగారు చూసుకుని లబోదిబోమన్నారు"

"అయితే ఇదెవరి పనంటావ్"

"పక్కింటి మేడావిడ ఈ మధ్య నాలుగైదు సార్లు పువ్వుల కోసం పని కుర్రాడిని పంపింది. ఆవిడే అడగొచ్చుగా? గర్వం ! పండగనాడు కూడా అడిగితే 'మాక్కావాలీ... ఇవ్వడం కుదరదని' మన కరుణ చెప్పింది. అంతే. ఆ రోజు నుంచీ ఎవర్నీ పంపటం లేదు."

"మరి .. ఆ పొగరుబోతు చేయించిందంటావేమిటీ పని"

"ఇంట్లో యిందరం వుండగా ఫట్టపగలే చేయిస్తుందా? అయినా ఇదేమన్నా దాచుకునే వస్తువా ఏమన్నానా... నాలుగు రోజుల్లో దొరికపోదూ"

ఆ సంభాషణను అక్కడితో ఆపేసి, మధుసూధనం పెరట్లోకి వెళ్ళి తల్లిని అడిగేడు. "ఏమ్మా ఈ రోజు గుళ్ళో కెళ్ళవా? సుందరకాండ సాగుతోందిగా"

వెళ్ళనన్నట్లు చేతులూపిందామె.

ఈలోగా కరుణ వచ్చింది స్కూలు నించి. ఆ పిల్ల చదివే ఆడపిల్లల స్కూల్ దగ్గరే. కాళ్ళు కడుక్కోడానికి పెరట్లోకి వచ్చి బామ్మ వంక అనుమానంగా చూసి, పలకరించబోయి, ఏమంటుందోనని భయపడి, ఆ ప్రయత్నం విరమించుకొని తల్లినడిగి విషయం తెలుసుకుంది.

మరో ఐదునిముషాలకే కిట్టూ స్కూలు బస్సు దిగేడు. మొన్న దీపావళి పండక్కి ఆరేళ్ళు వెళ్ళేయి వాడికి. వచ్చీరావడంతోనే పుస్తకాల సంచీ గూట్లో పడేసి గ్లాసుడు మంచినీళ్ళు తాగి, పెరట్లోకొచ్చి బామ్మ మీద వాలిపోయేడు. అయితే వాడికాసమయంలో బామ్మ పడుకుని వుండడం ఆశ్చర్యమనిపించింది. పైగా తనను చూసి కూడా మాట్లాడలేదు. ఒళ్ళోకి తీసుకోలేదు. ఉదయం కొనుక్కోమని ఇచ్చిన డబ్బులకి లెక్కా అడగలేదు. అంచేత వాడికి అనుమానమొచ్చింది. బామ్మకి జొరంగాని రాలేదు కదా! అనుకున్నాడు చేత్తో

ఆమె నుదురు తడిమి చూసేడు. పెద్ద తెలిసినవాడిలా నాడి చూశాడు. అబ్బే అనుకుని తల తిప్పేడు. "ఏమైంది బామ్మా" అని ఎంత అడిగినా ఆమె నోరు విప్పలేదు.

కిట్టూకి బామ్మ మీద విపరీతమైన కోపమొచ్చింది. 'ఈ పెద్దాళ్లింతే' అని విసుక్కుని అక్కడ్నించి లేచి కరుణ దగ్గరకు వెళ్ళి, "బామ్మ కేమైందే అక్కా. చాకలి మూటలా అలా వుందీ" అనడిగేడు.

"ముద్దుల మనవడివిగదా నీకూ చెప్పలేదా" అని డాబా మీదికి తీసుకువెళ్ళి అక్కడ చెప్పింది రహస్యంగా.

"నిజంగా అందుకే అలా అయిపోయిందా బామ్మ" ఆశ్చర్యపోయేడు.

"నిజమేనట అమ్మ చెప్పింది" అంది కరుణ.

కిట్టూ రయ్‌న డాబా దిగిపోయేడు.

ఇంతకీ అసలు విషయమేమిటంటే ఆ ఇంటి ముంగిట్లోని మూడడుగుల ఎత్తులో వెడల్పాటి ఆకులతో ఎదిగిన పారిజాతం మొక్క ఆ రోజే మాయమైంది.

"అది కేవలం మొక్కే. మూడడుగులదే కావచ్చు. కానీ దాని చరిత్ర మాత్రం ముప్ఫయ్ ఏళ్ళ నాటిది" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతం అయింది లక్ష్మీదేవమ్మ ఆ మధ్యాహ్నం.

కాస్సేపు బాధపడి, ఎవర్నీ అనేందుకు లేక, మౌనవ్రతం పూనింది.

ఈ మారు కిందికొచ్చి, బామ్మ నులక మంచం మీద బామ్మను కాస్సేపు సోఫాగా చేసుకుని కూర్చున్నాడు కిట్టూ.

ఆవిడ కదిలిందేగాని మాట్లాడలేదు.

"ఆ మొక్కను తీసిందెవరో నాకు తెలుసు" అన్నాడీమారు నెమ్మదిగా, బామ్మకే వినబడేలా. కళ్ళు విప్పి; ముసుగును కాస్త నుదిటి మీదికి లాక్కుని –

"ఎవరూ?" అందావిడ. ఆ గొంతులో జీర!

"నువ్వేం అననంటే చెబుతా" అన్నాడు అమాయకంగా – కిట్టూ తల నిమిరి, అభయహస్తమిచ్చిందావిడ.

"ఇంకెవరు. నేనేలే" అన్నాడు ధైర్యంగా.

లక్ష్మీదేవమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"ఆ మల్లెమొక్కకీ, జామిచెట్టుకీ మధ్యన వుండేదేనా" అన్నాడు మళ్ళీ – అవునన్నట్లు తలూపిందావిడ.

"నాకేం తెల్సూ – అదంటే నీకంత ఇష్టమనీ – జామిచెట్టు ఎక్కేటప్పుడల్లా దాని ఆకులు రాసుకుపోయి మంట పుట్టేది. ఎంత గరుకో దాని ఆకులు అదేదో పిచ్చి మొక్క అనుకుని పీకి పారేశా" అన్నాడు.

బామ్మకి మనవడి మీద కోపం వచ్చినా వెంటనే తమాయించుకుంది.

'ఆ భగవంతుడు నా చేతి పూలు వద్దనుకున్నాడు కాబోలు – లేకపోతే ఈ కుర్ర నాగన్న చేత అలా చేయిస్తాడా' అనుకుంది.

ఈమారు లేచి కూర్చుని కిట్టూతో అంది – "దాని ఆకులు అంత గరుకైనా దాని పూలు ఎంతో మృదువూ; సున్నితమూను; మీ తాతయ్యలాగే. నీకు తెలియదుగానీ ఆయన ఎంత కోపిష్టో మనసు అంత మెత్తన"

"చేసిన నిర్వాకం చాలుగానీ ఎక్కడ పడేశావో చూపించు" అంది భ్రమరాంబ విషయం తెలుసుకుని.

"చూసే వచ్చేను. అదక్కడ లేదు" అన్నాడు కిట్టూ బుంగమూతి పెట్టుకుని.

"ఇక మీరెవరూ వాడినేం అనకండి. అంతా నా ప్రారబ్ధం" అంది లక్ష్మీదేవమ్మ గుళ్ళోకి వెళ్ళే ప్రయత్నంలో లేచి, నూతి వైపు నడుస్తూ.

◆ ❖ ◆

ఆ రోజు సుందరకాండ చెప్పే శాస్త్రులుగారు ఎందుచేతనో రాలేదు. అంచేత మరొకరిచేత పురాణ కాలక్షేపం పెట్టించేరు గుళ్ళో.

వెళ్ళడం కాస్త ఆలస్యమైందేమో కాస్త వెనుకగా స్తంభానికానుకొని కూర్చుంది లక్ష్మీదేవమ్మ. ఏవో ఒకటి రెండు ముక్కలు చెవులబడ్డం తప్ప అందులో మనసు పూర్తిగా నిమగ్నం చేయలేకపోయింది. చందనాది అగరొత్తుల పరిమళం, పూల పరిమళం గాలిలో తేలి వచ్చి ఆమె ఆలోచనల్ని గతంలోకి లాక్కువెళ్ళాయి.

పూలంటే మొదట్నించీ ఎంతిష్టమో తనకి. పుట్టింట్లో నందివర్ధనం, మందారం, పారిజాతం, గులాబీ వంటి ఎన్నో పూలమొక్కలుండేవి. ఉదయమూ సాయంత్రమూ ఆ పూలను కోసి మాల కట్టి గుళ్ళో దేమునికిచ్చేది. ముఖ్యంగా పారిజాతపూలు తనకు అత్యంత ప్రాణప్రదమైనవి. ఆ తెల్లని చిన్ని రేకలు, ఆ తొడిమ రంగు, ఆహ్లాదకరమైన ఆ సువాసన తనకెంతో ఇష్టం.

పెళ్ళయి, అత్తవారింటికొచ్చిన కొత్తల్లో – వేణుగోపాలస్వామి కోవెలైతే దగ్గర్లోనే వుందికానీ ఇంట్లో పూలమొక్కలే సరిపడినన్ని లేకపోయాయి. అంచేత తొలి పండక్కి వెళ్ళి వచ్చేటప్పుడు తనతోపాటు పుట్టింటి జ్ఞాపకంగా ఓ చిన్ని పారిజాతం మొక్కను తెచ్చి అత్తవారింట్లో వేసింది. ఆ మొక్కే పెరిగి విరగబూస్తే ఎంత ఆనందమనిపించిందో! లెక్కలేనన్ని దాని పూలే తెల్లవారేక వేణుగోపాలస్వామిని చేరేవి! రోజూ తను తీసుకువెళ్ళే పూల కోసం ఆ పూజారిగారు ఎంతగానో ఎదురు చూసేవారు!

శీతాకాలపు తొలి రోజుల్లో మంచు విడని ఆ తొలి ఉషోదయంలో పూలన్నీ చెట్టునుండగానే పూలసజ్జలోకి కోసేది. తొందరపడి ముందే పూసిన పూలు కొన్ని నేల రాలిపోయేవి. అట్ల తదియనాడో, వీలుకుదరని మరునాడో తెల్లగా తెల్లారేక చూస్తే, నేల కనపడకుండా రాలి పరుచుకున్న పూలు పూల తివాచీ పరిచినట్లుండేది!

అటువంటప్పుడు చూసి ఆయన ఎంత సంతోషించేవారో! ముఖ్యంగా చలి ముదరని సాయంకాలాలు ఆరు బయట కూర్చున్నప్పుడు ఆ చెట్టు నుండి తేలివచ్చే పరిమళాలు ఎంత ఆహ్లాదపరచేవో! అటువంటప్పుడే –

"నీది పూలమనసు లక్ష్మీ – నువ్వీ ఇంటికి రాకముందు నాకు ఈ పూల అందమూ

తెలియదు. ఈ అనుభూతీ తెలియదు" అనేవారు.

ఎన్ని పూలతో పూజలు చేసినా వయసులో వుండగానే పూలు పెట్టుకునే భాగ్యానికి దూరమై పోయింది. అయినా ఏ దేవునీ నిందించలేదు. పూజలు మానుకోనూ లేదు. అదంతా పూర్వజన్మ దుష్కృతంగానే సరిపెట్టుకుంది.

ఉమ్మడి కుటుంబం వల్ల ఆస్తులు హరించుకుపోయి, చివరికి ఉన్న ఒక్క ఇల్లూ అమ్ముకుని ఊరు విడిచే పరిస్థితి ఏర్పడినా పారిజాతాన్ని మాత్రం అక్కడ వదలలేక పోయింది. పెద్ద మొక్క మాటున పెరిగే రెండు చిన్న పారిజాత మొక్కల్ని వేణుగోపాలుని ఆలయ ఆవరణలో నాటి, వాటి బాధ్యతను పూజారిగారి అమ్మాయికి అప్పగించి, "స్వామీ – ఇక నా చేతులతో నేను నీకు పూలివ్వలేను – వీటిని ఎలాగో నువ్వే పెంచుకుని ఆ పూలతో నీ పూజలు జరిపించుకో" అని వేణుగోపాలునికి ఓ దండం పెట్టి వచ్చేసింది.

ఏళ్ళు గడిచిపోయాయి.

కొడుకు ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో తిరిగారు.

చివరికీ ఊరు వచ్చి నాలుగేళ్ళయింది. మళ్ళీ ఇన్నాళ్ళకు ఇంటి దగ్గర్లోనే గురవాయూరప్ప మందిరం. పాతకాలం నాటి ఇల్లే అయినా ఇంటి ముంగిట్లో నాలుగు పూలమొక్కలు – ఎంత ఆనందాన్నిచ్చాయో ఈ ఏడు పదుల వయసులో.

అయితే ఇంటి ముందున్న పూలమొక్కల్లో పూజకు పనికొచ్చే పూలు తక్కువే. అంచేతే ఎలాగైనా పారిజాతాన్ని తెచ్చి వేయాలనుకుంది మళ్ళీ.

సరిగ్గా అప్పట్లోనే ఆ ఆలోచనా మనసులో మెదిలింది.

తమ ఊళ్ళో తను స్వహస్తాలతో వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో నాటిన మొక్కలు రెండూ ఎదిగి ఆ దేవుడి కోసం పూలను కురిపిస్తూనే ఉంటాయి.

వాటి మొదట్లో ఒకటి రెండు పిల్ల మొక్కలుండకపోవు. పుట్టింటి జ్ఞాపకంగా తను వాటిల్లో ఒకదాన్ని తెచ్చుకుని ఇక్కడ వేస్తే సరిపోతుంది.

ఆలోచన బాగానే ఉంది. కానీ అమలు జరిగేదెలా? ఒక చిన్ని మొక్క కోసం అన్ని మైళ్ళ దూర ప్రయాణం హాస్యాస్పదంగానే ఉంటుంది విన్నవారెవరికైనా.

అయితే మనసుంది కాబట్టి మార్గం సుగమం అయింది.

కొడుక్కి కంపెనీ వారు కలుగచేసిన సదుపాయాల వల్ల బస్సులో తీర్థయాత్రలు చేసుకొస్తూ మార్గమధ్యంలో తమ ఊళ్ళో దిగింది.

ఊళ్ళో నాగరికత ప్రవేశించింది. మనుషుల్లో ఆప్యాయతా అమాయకత్వం కాస్త తగ్గినట్లనిపించింది. తనకు తెలిసినవారు నాలుగైదు కుటుంబాలకు మించి లేరు. వ్యవసాయపు పనులు చేసుకునే వారు కూడ జీవనోపాధి కోసం పట్నాలకు జేరిపోయేరు. ఎందుకో ఆ వాతావరణం; ఆ మార్పు తనకు నచ్చలేదు. అది తన ఊరులా అనిపించలేదు.

పూజారిగారి కుటుంబాన్ని పలకరించి, గుళ్ళో వున్న ఒకే ఒక్క చిన్ని పారిజాతాన్ని ఆప్యాయంగా తెచ్చుకుంది. ప్రాణప్రదంగా చూసుకుంటున్న మొక్క నేడిలా అయింది.

అరంగుళమైనా మట్టి జాగా మిగల్చకుండా మేడలు కట్టే ఈ నాగరిక ప్రపంచంలో

పారిజాతం లాంటి పూలమొక్క మళ్ళీ ఎక్కడ దొరికేను? ఆమె మనసు మళ్లీ బాధతో మూలిగింది.

రోజూ వున్న పూలనే ఆ కృష్ణభగవానుడికి అర్పించడం, సాయంకాలాలు ఆలయ ఆవరణలో జరిగే పూజా కార్యక్రమంలోనూ, పురాణ కాలక్షేపంలోనూ, భజన కార్యక్రమంలోనూ పాల్గొనడం నిత్యకృత్యాల్లో భాగమైపోయింది.

"మా బామ్మకి రోజూ సాయంకాలం ఆరు నుండి ఎనిమిది గంటల వరకూ ప్రైవేటు క్లాసు గుళ్ళో" అంటూంటాడు కిట్టూ.

వాడి ఛలోక్తులకీ, తెలివితేటలకి అబ్బురపడుతూంటుంది. వాడి బుర్రలో వింత వింత ప్రశ్నలు!

అయితే కిట్టూ అడిగే ఒక్క ప్రశ్నకే తను జవాబు చెప్పలేకపోతుంది.

నిజమే "ఎందుకూ?" అన్నది ప్రశ్నగా బావుంటుంది. కానీ దానికి సమాధానం ఏమని చెబుతుంది?

ఈ నాగరిక ప్రపంచంలో కూడా భర్తలేని చిహ్నంగా జుట్టు లేని బోడితల తనదే!

అందుకే-

"లోకంలో ఏ స్త్రీకీ నాకు జరిగిన ఇటువంటి అన్యాయం, పరాభవం జరక్కుండా చూడు భగవంతుడా" అని రోజూ ఆ దేవుణ్ణి ప్రార్థిస్తూనే ఉంటుంది.

గుడిలో గంట మ్రోగింది

దక్షిణ కోసం పళ్ళెం తిప్పే వేళయింది. ఆలోచనల్లోంచి బయటపడి, కొంగు కొసన మూటగట్టిన పైసల్ని తీసి పళ్ళెంలో వేసి నెమ్మదిగా లేచింది.

◆ ❖ ◆

శనివారం సాయంకాలం.

కరుణ స్కూలు నించి వచ్చి అరగంట దాటినా కిట్టూ జాడలేదు. లక్ష్మీదేవమ్మ దేవుడికి పూలమాల కడుతూ తులసికోట దగ్గర కూర్చుంది.

"స్కూలు బస్సు కూడా వచ్చేసింది. వీడేమైనట్టో" అంది భ్రమరాంబ. ఆ మాటలు లక్ష్మీదేవమ్మ చెవులబడ్డాయి. మాల కట్టేసేక, అటు స్నానానికి వెళ్ళకుండా ఇటు వీధిలో కొచ్చి కూర్చుంది. ఏ వేళకి రావలసినవారు ఆ వేళకి ఇల్లు జేరకపోతే ఆమె మనసు మనసులో వుండదు. గుళ్ళోకెళ్ళినా ఆమె మనసు దేవుడి మీద లగ్నం కాదు. అంచేతే అటువంటప్పుడు గుళ్ళోకెళ్ళడమే మానుకుంటుంది.

మరో పావుగంట గడిచింది. మధుసూధనం కూడా వచ్చాడు కానీ కిట్టూ రాలేదు.

"ఏ ఫ్రెండింటికో వెళ్ళి ఉంటాడు. నే చూస్తాలే. నువ్వు గుళ్ళోకి వెళ్ళమ్మా" అని కొడుకు చెప్పినా ఆమె వీధరుగు మీంచి కదల్లేదు. ఆ పసివాడి మీదే ఆమె ప్రాణాలన్నీ. ఏ చిన్న తేడా వచ్చినా ఆమె మనసు విలవిల్లాడిపోతుంది. గతంలో జరిగిన విషాద సంఘటలన్నీ కళ్ళ ముందు కదలాడతాయి.

సరిగ్గా వీధి దీపాలు వెలిగించే సమయంలో, "బామ్మా" అంటూ దూసుకొచ్చాడు

కిట్టూ. వస్తూనే ఆమె మెడను కావలించుకున్నాడు.

"ఏరా. ఎక్కడికి పోయావ్ ఇంతసేపూ- మీ నాన్న వస్తాడుండు - ఈ వేళ నీ పని వుంది" అంది.

"నీ కోసమే వెళ్ళా బామ్మా. ఏం తెచ్చేనో చూడూ" అంటూ సంచిలో దాచిన దాన్ని తీసి, బామ్మ ముందు పెట్టేడు.

చిన్న ప్లాస్టిక్ గ్లాసులో జానెడు పొడవున్న మొక్క!

"పారిజాతమే! ఎక్కడిదీ" ఆమె కళ్ళలో ఆశ్చర్యం!

"మా ఫ్రెండు వాళ్ళింట్లో వుంది. నీ మొక్క పారేశానుగా మరి. అందుకే అడిగి తెచ్చా" అన్నాడు.

లక్ష్మీదేవమ్మ కళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోయాయి. మనవడిని దగ్గరకు తీసుకుని ముద్దులతో ముంచేస్తూ -

"నా బాబే నా మనసును కనుక్కున్నావ్. చచ్చి, నీ కడుపున పడుతాన్రా" అంది.

ఆ రాత్రి ఆమెకు పారిజాత పూలతో అలంకరించబడిన కృష్ణ భగవానుడు కలలో కన్పించాడు.

ఆ మర్నాడు తూర్పు దిక్కు తెల్లబడేవేళ -

ఇంటి ముంగిట్లో మొక్క నాటే కార్యక్రమం ఆనందోత్సాహాలతో జరిగింది.

లక్ష్మీదేవమ్మ ఇనుప అట్లకాడను తిరగేసి, మొక్కకు కావల్సినంత లోతు తవ్వి, కిట్టూ తెచ్చిన పారిజాతం మొక్కని వాడి చేతే పాతించింది.

"నారు పోసినవాడే నీరూ పొయ్యాలి. నీళ్ళు కూడా రోజూ నువ్వే పొయ్యాలి సుమా" అని వాడిచేత నీళ్ళు పోయించింది.

"మరి.. మన మున్సిపాలిటీవాళ్ళు మొక్కలకోసం వీధుల్లో గోతులు తవ్వించేరేగాని మొక్కల్ని నాటలేదేం బామ్మా" అని కిట్టూ అడిగిన ప్రశ్నకి-

"వాళ్ళేం నాటతార్రా వెర్రి నాగన్నా. నిజంగా వాళ్ళకి ఆ ధ్యాసే వుంటే మొక్కల్ని పెంచే ఇంటికి పదో పాతికో ఇంటి పన్ను తగ్గిస్తామంటే. అందరూ ఎంచక్కా వేసుకుంటారు మొక్కల్ని" అని తెలివిగా సమాధానం చెప్పింది.

ఆ తర్వాత మనవడిని దగ్గరకు తీసుకుని,

"మొక్కల్నీ పువ్వుల్నీ ప్రకృతినీ ఇష్టపడేవారికి సున్నితమైన మనసుంటుంది. జాలి, దయ వంటి మంచి గుణాలుంటాయి. ఆ రెండూ వుంటే పుణ్యకార్యాలు చేస్తారు. జన్మంటూ వుంటే మరో మంచి జన్మ ఎత్తి తోటి ప్రాణికి సహాయపడతారు" అంది.

కిట్టూకి ఆమె మాటలు సగం అర్థమే కాలేదు - వాడికి అర్థమైనదొక్కటే బామ్మ మనసు బహు సున్నితమని!

● స్వాతి మాసపత్రిక